క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామ సచివాలయ పరిధిలోని కేతవరం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు.

నేడు బద్రిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ సందర్భంగా అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

మహిళా మండలి అధ్యక్షురాలిగా విజయలక్ష్మి



ఖాజీపేట : ఆర్యవైశ్య నూతన మహిళా మండలి అధ్యక్షురాలిగా తాతా విజయలక్ష్మి నూతనంగా ఎన్నికయ్యారు. ఖాజీపేట లోని అమ్మవారిశాలలో నూతన మహిళా మండలి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో తాతా విజయలక్ష్మిని అధ్యక్షురాలిగా అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఉపాధ్యక్షురాలిగా మాకం రాధిక, సునిత, సెక్రటరీగా సుధామణి, జాయింట్ సెక్రటరీగా శిరీషా తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ సభాభవనంలో జరిగే సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వధూవరులకు ఆశీర్వాదం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ముడియం గౌతమ్‌రెడ్డి, అదే గ్రామంలోని సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు గోనా వెంకటసుబ్బారెడ్డి కుమార్తె నందినిరెడ్డి వివాహం వెల్లాల పుణ్యక్షేత్రంలో గురువారం జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే రాచమల్లు, బంగారు రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

నేడు ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

బద్వేలు అర్బన్ : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ విభాగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ అవగాహన సదస్సుకు ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ సజ్జా శ్రీచైతన్య, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, జిల్లా యువజన సర్వీసుల అధికారి సాయిగ్రేస్ తదితరులు హాజరవుతారని, 17 సంవత్సరాలకు పైబడి ఆసక్తి కలిగిన యువతీయువకులు అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల : ఈ నెలాఖరులోగా మండలంలోని రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వరహరికుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరైనవారు, పట్టాదారు మృతి చెందితే ఆయన భార్య, నామినీల పేరున పట్టా చేసి రైతు భరోసా వచ్చేలా చూస్తామన్నారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేసుకోవాల్సిన వారు వెంటనే చేయించుకోవాలన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

బి.కోడూరు : మండలంలోని రాజుపాలెం గ్రామంలో కోదండ రామాలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా గురువారం వేద పండితులు కనుమళ్ల సత్యనారాయణశర్మ, కురిమేటి సాయిరామ్‌శర్మల ఆధ్వర్యంలో సీతారాములవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిపైనే ఫోకస్

- రూ. 1 కోటితో రాజీవ్‌గాంధీ నేషనల్ ఎకో పార్కు అభివృద్ధి
- అటవీశాఖ అధికారులతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు క్రైం : ప్రజల అవసరాలు, అభివృద్ధిపైనే తన ఫోకస్ ఉంటుందని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎర్రగుంట్లరోడ్డులోని రాజీవ్‌గాంధీ నేషనల్ ఏకో పార్కులో గురువారం అటవీశాఖ అధికారులు, వాకర్స్‌తో ఎమ్మెల్యే రాచమల్లు ముఖాముఖి సమావేశం నిర్వహించారు. పార్కులో చేయాల్సిన అభివృద్ధి పనులపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. పార్కులో వివిధ రకాల రెండు వేల మొక్కలను తన సొంత ఖర్చులో నాటుతానని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాదే పనులను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అటవీశాఖ కార్యాలయం సమీపంలో పెద్ద గుంత ఉందని, నీటిని నింపితే పార్కులో సంచరించే జంతువులకు తాడగానికి ఉపయోగపడుతుందని నంగనూరుపల్లెకు చెందిన శంకర్ తెలిపారు. పార్కులో ఏర్పాటు చేయనున్న స్విమ్మింగ్ పూల్ నుంచి వదిలే వృథా నీటిని అక్కడికి వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వాకింగ్ ట్రాక్‌లో కొంత ఇసుకను పరచాలని, పార్కు చుట్టు దెబ్బతిన్న ప్రహరీని నిర్మించాలని కోరారు.

పార్కులో అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించండి

నాలుగు రోజుల క్రితం చెప్పినట్లుగా రూ. 50 లక్షలను అందచేస్తామని, పార్కులో అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అటవీ అధికారులతో అన్నారు. పార్కుకు వచ్చే 500–600 మందితో ఒకసారి సమావేశం నిర్వహిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే అన్నారు. పార్కులో ఎంట్రెన్స్ ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారంటూ వాకర్స్ ముందుగా తన వద్దకు వచ్చారన్నారు. అధికారులకు ఫోన్ చేసైనా ఈ సమస్యను తాను పరిష్కారం చేయొచ్చని ఎమ్మెల్యే అన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి ఒప్పించానని చెప్పారు. అవసరం అనుకుంటే ఎంట్రెన్స్ ఫీజును తానే భరిస్తానని కలెక్టర్‌తో చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నియోజకర్గవ్యాప్తంగా అభివృద్ధి పనులు

ప్రొద్దుటూరుతో పాటు నియోజకవర్గం వ్యాప్తంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. 35 ఏళ్లుగా ప్రొద్దుటూరు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ రోజు మైలవరం నుంచి రూ. 120 కోట్లతో అమృత్ పథకం కింద నీరు తెచ్చానన్నారు. ప్రస్తుతం ట్రయల్ రన్ జరుగుతోందని కొన్ని రోజుల్లోనే ప్రజలకు నీటిని అందిస్తామని చెప్పారు. శ్రీశైలంలో నీరు ఉన్నంత వరకు ప్రొద్దుటూరు ప్రజలకు నీటి కొరత ఉండదన్నారు. భవిష్యత్ కాలంలో నీటి సమస్య ఉత్పన్నం కాబోదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా చెప్పారు. రూ.53 కోట్లతో ప్రొద్దుటూరు నడిబొడ్డున కూరగాయల మార్కెట్‌ను నిర్మిస్తున్నామన్నారు. రూ. 52 కోట్లతో రామేశ్వరం పెన్నా నదిపై బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 75 ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ స్థానంలో రూ. 160 కోట్లతో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రూ. 5 కోట్లతో ఆర్టీసీ బస్టాండు, రూ.165 కోట్లతో వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రూ.3 కోట్లతో గాంధీ మున్సిపల్ పార్కును ఆధునీకరించామన్నారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పార్కులో రూ. 4.5 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. అందరూ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, సబ్‌డీఎఫ్ఓ దివాకర్, ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాపరెడ్డి, రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ బోర్డు మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, పార్టీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధం



గంధానికి ఆశ్రమంలో స్వాగతం పలుకుతున్న పీఠాధిపతులు

మైదుకూరు : మండలంలోని హజరత్ అష్రఫే–దోజహా –ఆరా – మా సాహెబా (మాతృశ్రీ) ఆశ్రమంలో గురువారం గంధం మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మైదుకూరు – బద్వేలు రహదారిలో నంద్యాలంపేట వద్ద ఉన్న ఈ ఆశ్రమంలో గంధం మహోత్సవాలలో గురువారం ప్రొద్దుటూరు నుంచి శ్రీహజరత్ జహూర్ అలీషా ఖాద్రి చిష్టి కుమారులు, జీవీ సత్రం నుండి పఠాన్ సత్తార్ ఖాన్ కుమారులు గంధాన్ని తీసుకొచ్చారు. అష్రఫే దోజహా – ఆరా – మా సాహెబా, గౌస్ యాజం దస్తగిరి స్వామి వారికి హజరత్ జహూర్ అలీషా ఖాద్రి వారికి గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఫాతేహా నిర్వహించారు. గంధం మహోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : స్కానింగ్ సెంటర్లలో రికార్డుల నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ హెచ్చరించారు. ప్రొద్దుటూరులోని స్కానింగ్ సెంటర్లను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు స్కానింగ్ సెంటర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు డాక్టర్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేయరాదన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థుల ప్రతిభ

చాపాడు : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు చెందిన 59 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కస్తూర్బా ప్రత్యేకాధికారి నాగలక్షుమ్మ తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 21 మందికి గాను 13 మంది ఉత్తీర్ణతతో 61శాతం, సెకెండియర్‌లో 30 మందికి గాను 17 మంది ఉత్తీర్ణతో 56 శాతం ఫలితాలు సాధించారు. ఫస్టియర్‌కు చెందిన ఎం.మహాలక్ష్మీ 470కి గాను 402 మార్కులు సాధించగా, సెకెండియర్‌లో వీర సమీరా, హసీనా 1000 మార్కులకు గాను 860 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు.

అట్లూరు : స్థానిక కస్తూర్బా గాంధీ భాలికల విద్యాలయంలో చదివే పి.త్రివేణి అనే విద్యార్థిని ఇంటర్‌లో 851 మార్కులు సాధించినట్టు ఆపాఠశాల ప్రత్యేక అధికారిణి ఫణిశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

పాడిరైతులకు మందుల పంపిణీ



పాడిరైతులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : వేసవి కాలంలో పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పుట్టాయపల్లె పంచాయతీ సర్పంచ్ వంకెల జయరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పుట్టాయపల్లె పంచాయతీ గొడుగునూరు గ్రామంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహకారంతో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ పశు సంపద బాగుంటే పాడిపరిశ్రమ బాగుంటుందన్నారు. ఈ శిబిరంలో 42 గేదెలకు గర్భకోశ చికిత్సలు, 21 పశువులకు సాధారణ చికిత్సలు, 160 గొర్రెలు, 59 మేకలకు నట్టల నివారణ మందులు, 19 దూడలకు ఏలికపాము నివారణ మందులు తాపించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ పవన్, వాటర్‌షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవం.. గంగా జయంతి ఉత్సవం



ఆలయంపై కలశాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలో ఎంతో విశిష్టత కలిగిన పాత గంగమ్మ ఆలయంలోని గ్రామదేవత గంగమ్మ జయంతి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేసి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే ఆలయంపై శిఖర కలశ ప్రతిష్ఠ అమ్మవారికి మకరతోరణం ఏర్పాటు చేశారు. ఈ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు తరలివచ్చారు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువుగా గ్రామ దేవత గంగమ్మ ఇక్కడ కొలువై ఉందని భక్తులు చెబుతున్నారు. అక్కడకు వచ్చిన వారందరికి ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మైదుకూరు కమిషనర్‌గా రంగస్వామి



మైదుకూరు : మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా రంగస్వామి గురువారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటేషన్‌పై కమిషనర్‌గా విధుల్లో ఉన్న డి.రాముడు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో సహాయ కమిషనర్‌గా ఉన్న రంగస్వామి మైదుకూరు కమిషనర్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన మర్యాదపూర్వకంగా మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రను కలిశారు.

సచివాలయ ఉద్యోగులు సమయం పాటించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : సచివాలయ ఉద్యోగులు సమయం పాటించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతీరుపై అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 9:30 నుండి 10 గంటల లోపల అటెండెన్స్ వేయాలన్నారు. ఆలస్యంగా వస్తున్న వారికి మెమోలు ఇచ్చామన్నారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొనాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను రిజిస్టర్‌లో నమోదు చేసి ప్రణాళిక ప్రకారం పరిశీలించాలన్నారు. అలాగే మండలంలో జరుగుతున్న పనులు, నాడు – నేడు, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, గడప గడపకు కార్యక్రమంలో గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులతో మాట్లాడి వారి స్పందన తెలుసుకోవాలన్నారు. ఇంకా అర్హత ఉండి పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వలంటీర్ల ద్వారా గుర్తించి వారికి పథకాలు వర్తింపజేయాలన్నారు. అలాగే ఖరీఫ్‌కు ముందస్తుగా ఒక్కో ఆర్బీకే కేంద్రంలో పది టన్నుల మేర ఎరువులు నిల్వ ఉంచేందుకు ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కిసాన్ డ్రోన్ స్ప్రేపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మే నెలలో రైతుభరోసా రైతుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేయనుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ హసీన, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ తప్పక నిర్వహించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

మైదుకూరు : ప్రతి పాఠశాలలో సోషల్ ఆడిట్ తప్పక నిర్వహించాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి అన్నారు. మైదుకూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో స్కూల్ పెర్ఫార్మన్స్ ఎవల్యూషన్ టూల్‌పై ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ వరల్డ్ బ్యాంకు ఆంధ్రప్రదేశ్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా స్కూల్ పెర్ఫార్మన్స్ ఎవల్యూషన్ టూల్‌లో తల్లిదండ్రుల కమిటీ సభ్యుల చేత ఈ సోషల్ ఆడిట్‌ను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కేశవరెడ్డి, రిసోర్స్ పర్సన్లు వై.వెంకటసుబ్బయ్య, బీకే సురేష్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు పుల్లయ్యపై 2021లో వచ్చిన ఫిర్యాదులపై డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి విచారణ చేశారు. సిలబస్ పూర్తి చేయలేదని అప్పట్లో పుల్లయ్యపై ఫిర్యాదు రావడంతో ప్రాథమిక విచారణ జరిపి తలమించిపట్నం పాఠశాలకు బదిలీ చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ –2023 పరీక్ష కోసం ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ సిహెచ్. జ్యోతి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిసెట్ ఉచిత శిక్షణకు పది పరీక్షలు రాసిన వివిధ పాఠశాలల నుంచి 50 మందిదాకా బాలబాలికలు వస్తున్నారని తెలిపారు. మీరందరికి ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌ను అందచేశామన్నారు. పాలిసెట్ పరీక్షకు ఏప్రిల్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాలిసెట్ పరీక్ష కోసం ఉచిత శిక్షణను రోజు ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ మే 7వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



మహిళా రెజ్లర్లకు మద్దతుగా ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.గౌతమి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబులు పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా గురువారం స్థానిక సుందరయ్య భవనం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశపు కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా మహిళా రెజ్లింగ్ క్రీడాకారులు పతకాలు సాధిస్తుంటే వారికి అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు లైంగిక వేధింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. నాలుగు నెలల క్రితం మహిళా క్రీడాకారిణులు ఆందోళన చేస్తే కేంద్ర ప్రభుత్వం కమిటీలు వేసి చేతులు దులుపుకుందే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే బీజేపీ ప్రభుత్వం మహిళా రెజ్లర్ల ఆందోళనకు స్పందించి ఆ పార్టీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు, డీవైఎఫ్ఐ మహిళా కన్వీనర్ గురుదేవి, కో–కన్వీనర్ నాగేశ్వరి, పట్టణ నాయకులు నాగార్జున, మల్లికార్జున, సీఐటీయూ నాయకులు రాజగోపాల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విశేష ప్రతిభ



శ్రీ విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు



నారాయణ కాలేజి విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని పలు జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచి మంచి మార్కులు సాధించారు. స్థానిక శ్రీవిద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకుగాను స్పందన 465, కుముదిని, సోనిక, రేణుకలక్ష్మి, భరత్ 463, నిఖిత 461, వసీయ 461, ధరణీధర్, అఫీసా 460, తనూజ 458, కరిష్మా, సూర్యవినయ్, సాత్విక, 457 మార్కులతో సత్తా చాటారు. బైపీసీలో 440 మార్కులను గాను హారిణి 425, అలీమా సుహానా 423 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకుగాను చరితాంజలి 988, ప్రత్యూష, నిహారిక 986, శ్రీవందన 984, అను 978, బైపీసీలో శ్రావణి 965, నాగహాసిని 944, ఉస్మాన్ గని 926, సఫియా 918, సాయితూజ 922మార్కులు సాదించారు. వీరిని ప్రిన్సిపాల్ రమణరావు, డైరెక్టర్లు దస్తగిరి, శ్రీకాంత్ కుమార్‌రెడ్డి, రామమోహన్, అధ్యాపకులు అభినందించారు.

నారాయణ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో దీపిక 989, అబ్దుల్‌రహమాన్ 987, వెంకట తరుణ్ 986, ధనుష్య 984, బైపీసీలో లక్ష్మిహారిక 981, కీర్తి 981, ధనరాజు 976, సాయి 971, వైష్ణవి 960, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో నిఖిలసంధ్య 464, కార్తీక్‌రెడ్డి 462, యశస్విని, భరత్, 461, బైపీసీలో అఫ్రీన్‌భాను 435, రమ్యసాయి 431 మార్కులు సాధించారు. వీరిని డీజీఎం రామమోహన్ రెడ్డి, డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవరెడ్డి, ఏజీఎం వెంకట రామిరెడ్డి అభినందించారు.

రక్తదానం

వైవీయూ : ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి రక్తకొరత లేని సమాజాన్ని నిర్మించేందుకు ముందుకు రావాలని సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు సునీల్ జయంత్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సంధ్య సర్కిల్‌లో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన వారోత్సవాల్లో 6వ రోజుల రక్తదాన శిబిరం నిర్వహించారు. 15 మంది యువకులు రక్తదానం చేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్వే

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్పెషల్ క్యాంపులో భాగంగా గురువారం నగరంలోని నిరంజన్ నగర్‌లో యూత్‌పాలసీపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల్ నాగరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం అందిస్తున్న పథకాలపై వలంటీర్లు సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

యూనియన్ గుర్తింపు రద్దు దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాడుతున్న రైతు సంఘాలకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ విరాళాలు సేకరించిందని గుర్తింపు రద్దు చేయడం దారుణమని ఆ యూనియన్ డివిజన్ సెక్రటరీ జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ చట్టాల రద్దుకై పోరాడుతున్న రైతు సంఘాలకు కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ద్వారా విరాళాలు అందజేశారన్న నెపంతో గుర్తు రద్దు చేయడం తగదన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం గుర్తింపు రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి భానుకృష్ణ, జిల్లా అధ్యక్షులు రమణయ్య, నాయకులు మహబూబ్ బాష, నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కడప రాయుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత మూలమూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయ జయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది.

రూ. 500కే సిలిండర్ ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌ను రూ. 500లకే ఇవ్వాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బషీరున్నీసా డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏపీ మహిళా సమాఖ్య రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.